ప్రజాశక్తి

గురువారం 31 జూలై 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

వార్తలు 2లో..

విశాఖ తీరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

లూలూకు భూ కేటాయింపులపై భగ్గు

రాజయ్యపేటలో నిరసన ర్యాలీ చేపట్టిన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం తదితరులు

బల్క్ డ్రగ్ పార్కుపై నిరసన ర్యాలీ

అన్న క్యాంటీన్‌లో రాత్రి భోజనాల పరిశీలన

వార్త 2లో..

1941.19 ఎకరాల భూ సమీకరణ

విఎంఆర్‌డిఎ పరిధిలో ల్యాండ్ పూలింగ్‌కు జిఒ 146 విడుదల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం విఎంఆర్‌డిఎ పరిధిలో ల్యాండ్ పూలింగ్‌కు పూనుకున్నాయి. ఈ క్రమంలో విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో సుమారు1941.19 ఎకరాలు సేకరించాలంటూ బుధవారం జిఒ నెంబర్ 146ను ప్రభుత్వం విడుదల చేసింది. దీనిలో భాగంగా విశాఖపట్నం జిల్లాలో 1132.09, విజయనగరం జిల్లాలో 25.41, అనకాపల్లి జిల్లాలో 783.69 ఎకరాలు భూ సమీకరణ చేయాలని అధికారులు నిర్ణయించారు. కోస్తా తీరంలో పర్యాటకం, నివాసం, జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, ఫ్లోరిడా లోని మియామీ నగరాన్ని ఆదర్శంగా తీసుకుని విశాఖ నగరాన్ని మిగతా 2లో..

కెకె లైన్‌లో రైళ్ల సేవలు పునరుద్ధరణ

వార్త 2లో..

లక్ష్యాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వారాంతపు లక్ష్యాలకు అనుగుణంగా ఎన్‌టిఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరగాలని, మెరుగైన ఫలితాలు సాధించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 2026 మార్చి నాటికి అన్ని ఇళ్లూ పూర్తి కావాలని నిర్దేశించారు. రోజువారీ లక్ష్యాలు పెట్టుకొని పని చేయాలని, పురోగతి సాధించాలని సూచించారు. బుధవారం హౌసింగ్, స్పెషల్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై లేఅవుట్ల వారీగా ఆయన సమీక్షించారు. లక్ష్యాలపై దృష్టి సారించాలని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఇళ్ల నిర్మాణాల పనులు చేయించాలని పేర్కొన్నారు. లక్ష్య సాధనలో విఫలమైన అధికారులు, సిబ్బందికి మెమోలు జారీ చేయాలని హౌసింగ్ పీడీని

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, ఇఇ శ్రీనివాసరావు, డిఇలు, ఎఇలు, లేఅవుట్ ఇన్‌ఛార్జి అధికారులు, ప్రత్యేక అధికారులు, వర్చ్యువల్‌గా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఐవిఎఫ్ సెంటర్లలో కొనసాగుతున్న తనిఖీలు

ఐవిఎఫ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సీతమ్మధార, విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలోని ఫెర్టి9 ఐవిఎఫ్ సెంటర్, వైజాగ్ ఐవిఎఫ్ సెంటర్, డాక్టర్ ఆడమ్స్ ఫెర్టిలిటీ సెంటర్లను డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావులతో కూడిన వైద్య బృందం బుధవారం తనిఖీ చేసింది. యాజమాన్యాలకు పలు సూచనలు చేసింది. అన్ని రికార్డులనూ ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌ల్లో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్లలో వెలుగు చూసిన అక్రమ పద్ధతుల నేపథ్యంలో కొద్ది రోజులుగా విశాఖలోని సరోగసీ సెంటర్లలో ఈ తనిఖీలను ముమ్మరం చేసిన విషయం తెలిసిందే.

మొదటి పేజీ తరువాయి..

1941.19 ఎకరాల భూ సమీకరణ

అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకమైన ప్రణాళికలు రూపొందించినట్టు వారు తెలిపారు. విశాఖను వాణిజ్య ప్రాంతంగా అభివృద్ధి చేయడం కోసం ఈ భూ సమీకరణ చేపడుతున్నట్టు జిఒలో పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్‌లో రాత్రి భోజనాల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అన్న క్యాంటీన్లలో పరిశుభ్రమైన, రుచికరమైన భోజనాన్ని ప్రజలకు అందించాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన జివిఎంసి జోన్ - 3 పరిధి ఎంవిపి.కాలనీలో ఉన్న అన్న క్యాంటీన్‌లో రాత్రి భోజనాలను, సదుపాయాలను, పరిశుభ్రతను జోనల్ కమిషనర్ శివప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. తొలుత కమిషనర్ క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్పందిస్తూ పరిశుభ్రమైన భోజనం అందుతోందని తెలిపారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

నడుపూరులో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

గాజువాక : విద్యుత్ ఛార్జీలు పెంచే స్మార్ట్‌మీటర్లను రద్దుచేయాలని కోరుతూ సిపిఎం స్టీల్‌జోన్ కమిటీ ఆధ్వర్యాన బుధవారం నడుపూరులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ స్టీల్ జోన్ కార్యదర్శి పి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకు సిపిఎం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.వెంకటరావు, యు.రామస్వామి, నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, నారాయణ, పాల అప్పలరెడ్డి, యు.సోమేష్, పి.మసేను తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన పద్మనాభం సంత బయలు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. స్టిక్కర్లు అంటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ జోన్ సహాయ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు మాట్లాడారు. కె.సీతాదేవి, నాయకులు పంపాను సూర్యనారాయణ, ములపర్తి అప్పారావు, సింగిడి రాము, ఎం.రవణ, పొగరు అప్పారావు, చిన్న పద్దు, పెద్ద పద్దు పాల్గొన్నారు.

కె.కోటపాడు : అదానీ స్మార్ట్ మీటర్లను ఇంటికి బిగించకుండా అడ్డుకోవాలని కోరుతూ కె.కోటపాడు మండల కేంద్రంలో సిపిఎం నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాయుడు బాబు, కండిపల్లి సహదేవుడు, శెట్టి రమణ, జలంధే నాయుడు, జలం మహాలక్ష్మి, శ్రీనివాసరావు, అప్పలరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను వినియోగదారులు వ్యతిరేకించాలని సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని మోసయ్యపేట గ్రామంలో బుధవారం స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్ర ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల కన్వీనర్ ఆర్.లక్ష్మి, బొబ్బిలి అమృత, ఎం.సరోజిని, కె.లక్ష్మి, కె.కాసులమ్మ, ఎం.వనజ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అల్లిపురం నీలమ్మ వేప చెట్టు ప్రాంతంలో కె.గణేష్ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేశారు. గోడలకు స్టిక్కర్లు అతికించారు. సిపిఎం జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పెట్టేందుకు ప్రయత్నించగా వాటిని పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన నారా లోకేష్ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను పెడుతుంటే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కర్రి చంద్రశేఖర్, చంద్రమౌళి, కె.నర్సింగరావు పాల్గొన్నారు.

వైద్య రంగానికి నిధుల కేటాయింపులో అలసత్వం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైద్య రంగానికి తగినన్ని నిధులు కేటాయించడంలో అలసత్వం కారణంగానే భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామాన్యులకు వైద్యం అందుబాటులో లేకుండా పోతోందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కె.ఖాలేషా సాహెబ్ అన్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక (జెవివి) విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. 'హెల్త్ కేర్ ఇన్ ఇండియా లయద మెడికల్ ఫెసిలిటీస్ ఇన్ డెవలప్డ్ కంట్రీస్' అంశంపై ఆయన సదస్సులో వైద్య విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పేద ప్రజలు ఎక్కువగా నివాసముండే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యం ఇప్పటికీ అందుబాటులోకి రాలేదన్నారు. మారుమూల ప్రాంతాలలోని ప్రజలు వైద్యానికి నోచుకోక ప్రత్యామ్నాయ నాటు వైద్యాన్ని ఆశ్రయించి మరణాలపాలవుతున్నారన్నారు. పట్టణ ప్రాంతాల్లో వైద్యం సామాన్య, మధ్యతరగతికి ఖరీదైనదిగా మారిపోయిందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పిఎస్.శ్రీనివాస్, ఎస్‌పిఎం మనోజ్ అరవింద్, జెవివి రాష్ట్ర నాయకులు జి.మురళీధర్, డాక్టర్ రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వైఎఆర్‌కె.ప్రసాద్, ఉపాధ్యక్షులు శేషగిరి, డాక్టర్ పి.లక్ష్మణస్వామి, పీపుల్ ఫర్ ఇండియా నాయకులు బిఎల్.నారాయణ పాల్గొన్నారు.

50 శాతం ఆస్తి పన్ను వసూలు లక్ష్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆగస్టు 31వ తేదీ నాటికి 50 శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు పనిచేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులతో పన్ను వసూళ్లపై సమీక్షించారు. కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కెకె లైన్‌లో రైళ్ల సేవలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కొరాపుట్ - కిరండూల్ లైన్‌లో ట్రాక్ మరమ్మతుల కారణంగా నిలిపివేసిన రైళ్ల సేవలను యథాతథంగా పునరుద్ధరించాలని తూర్పు కోస్తా రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 18515 విశాఖపట్నం - కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్, 18005 హౌరా - జగ్దల్‌పూర్ సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్, 18107 రూర్కెలా - జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 18447 భువనేశ్వర్ - జగదల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లను జులై 30 నుండి, 18516 కిరండూల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్, 58501 విశాఖపట్నం - కిరండూల్ ప్యాసింజర్, 18108 జగదల్‌పూర్ - రూర్కెలా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, 18448 జగదల్‌పూర్ - భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లను జులై 31 నుండి ఎప్పటిలాగే నడుపనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

SYNERGIES CASTINGS LIMITED

Safety Officer నియామకమునకై ఈ దిగువ అర్హతలు కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

1. ఫ్యాక్టరీ యాక్ట్ సెక్షన్ 40 - బి మరియు ఆంధ్రప్రదేశ్ రూల్ 61-ఎ ప్రకారం తగిన విద్యార్హతలు ఉండవలెను.
2. తగినంత తెలుగు భాషా పరిజ్ఞానం అవసరం.

3 రోజులలో ఈ క్రింది చిరునామాకు దరఖాస్తులు పంపవలెను.

DGM - HR&A, సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్
3, VSEZ, దువ్వాడ, విశాఖపట్నం - 530 049

లూలూకు భూ కేటాయింపులపై భగ్గు

విశాఖ తీరంలో సిపిఎం ఆందోళన

సిబిఐ విచారణకు డిమాండ్ - సైన్స్ పార్కుగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విదేశీ బహుళజాతి సంస్థ లూలూ మాల్‌కు రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం విశాఖ సాగర తీరంలో చట్ట విరుద్ధంగా భూములు కేటాయించడంపై సిపిఎం భగ్గుమంది. ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యాన సదరు భూముల్లో బుధవారం ఆందోళన చేపట్టారు. భూ కేటాయింపులపై సిబిఐతో సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఆ భూములను సైన్స్ పార్కుగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తొలుత తీరం నుంచి ఆ భూముల వరకూ నిరసన ప్రదర్శన సాగింది. అనంతరం అక్కడ చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడారు. భూ కేటాయింపుల వెనుకనున్న మతలబును ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారం వెనుక వందల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని అన్నారు. జివిఎంసి పరిధిలోని ప్రభుత్వ భూములను ప్రజల అవసరాలకే వినియోగించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు రాష్ట్రంలో నత్త నడకను తలపిస్తోందన్నారు. అదే సమయంలో వందలాది ఎకరాల విలువైన ప్రజల భూములను మాత్రం స్వదేశీ, విదేశీ బహుళ జాతి సంస్థలకు, ప్రైవేటు వ్యక్తులకు రాకెట్ వేగంతో పైసలకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. ఈ భూ దోపిడీని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో లూలూకు భూ కేటాయింపులకు పాల్పడి పెద్ద ఎత్తున ప్రజాగ్రహానికి గురైన విషయాన్ని గుర్తుచేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ కేటాయింపులను రద్దు చేయగా, మరలా చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఈ భూ కేటాయింపులకు పాల్పడుతోందన్నారు. లూలూ సంస్థకు, చంద్రబాబు ప్రభుత్వానికి ఉన్న బలమైన బంధాన్ని ఇది తెలియజేస్తోందన్నారు. భూ కేటాయింపులను తక్షణం రద్దు చేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఈ భూ కేటాయింపులు పెద్ద గోల్ మాల్ అని, ఈ మాల్ వల్ల పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తారన్నది బూటకమని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు భూములను, కొండలను, సముద్రతీర ప్రాంతాలను రక్షిస్తామని హామీనిచ్చి, అధికారం చేపట్టిన తర్వాత భూదోపిడీని మరింత పెంచడం కూటమి ప్రభుత్వ ప్రజావంచనకు నిదర్శనమని అన్నారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ, పి.పైడిరాజు, నరేంద్ర కుమార్, కె.రమాప్రభ, ఎల్‌జె.నాయుడు, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, జివిఎన్.చలపతి, కెఎం.కుమార మంగళం, మహిళా నాయకులు కె.కుమారి, డి.కొండమ్మ పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కుపై నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - నక్కపల్లి : అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆగస్టు 6న బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బుధవారం మత్స్యకారులతో కలిసి బల్క్ డ్రగ్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ చేపట్టారు. బల్క్ డ్రగ్ పార్కు వస్తే జరిగే ప్రమాదాలను వివరిస్తూ ఆ ప్రదర్శనలో అస్తి పంజరాలతో కూడిన బ్యానర్లు చుట్టుకుని నిరసనకారులు ముందుకు కదిలారు. అక్కడ జరిగిన సభలో లోకనాథం మాట్లాడుతూ పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యాలకు, మత్స్యకారుల జీవనోపాధికి నష్టం కలిగించే బల్క్ డ్రగ్స్ పార్క్‌ను ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రజలు, మత్స్యకారులు వ్యతిరేకిస్తున్నా బల్క్ డ్రగ్స్ పార్క్‌ను ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యాలు, మత్స్యకారుల జీవనోపాధి పట్టడం లేదన్నారు. పారిశ్రామికవేత్తల ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తూ ఈ ప్రాంత ప్రజానీకాన్ని తీవ్రంగా దగా చేస్తున్నారని మండిపడ్డారు. విదేశాల్లోనూ, కాకినాడ జిల్లా తొండంగి ప్రాంతంలోనూ ప్రజలు వ్యతిరేకించిన బల్క్ డ్రగ్ పార్కును ఈ ప్రాంతంలో ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. విషతుల్య పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతంలో ప్రజలు ఎలా నివసించగలరని అడిగారు.

పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఎం.మహేష్ బాబు, జి.సోమేశ్వరరావు, ఎరిపల్లి నాగేష్, పిక్కి తాతీలు, కోడా కాశీరావు, సిహెచ్.కాశీ, బి.అప్పలరాజు, నరేష్, సంజీవ్ పాల్గొన్నారు.

గుండె జబ్బు పరికరాల కోసం భిక్షాటన

కెజిహెచ్ ఎదుట భిక్షాటన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో గుండె జబ్బుల విభాగానికి పరికరాలు కొనుగోలు చేయాలంటూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం భిక్షాటన చేపట్టారు. ఆసుపత్రి ప్రవేశ ద్వారం వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడారు. కెజిహెచ్‌లో ఆరు మాసాలుగా గుండె జబ్బుల ఆపరేషన్లు నిలిచిపోయిన నేపథ్యంలో పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసుపత్రిలో పాడై మూలనపడ్డ గుండె జబ్బుల ఆపరేషన్ల పరికరాలు బదులు కొత్త వాటిని ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కొత్త పరికరాలను కొనుగోలు చేసేందుకు డబ్బు లేదని చెబుతున్నారని తెలిపారు. యోగాంధ్ర పేరుతో ఒక్క రోజులో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వం కెజిహెచ్‌లో గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సకు అవసరమైన పరికరాలు కొనేందుకు మాత్రం ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు కాసులు కురిపించేందుకే ఇలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పార్టీ జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే, విశాఖ ఎంపీ కెజిహెచ్ పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, దానయ్య, వెంకటలక్ష్మి, హేమ, దుర్గారావు, ఎల్లయ్య పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో పర్యాటకులకు తాగునీరు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎకు చెందిన ప్రముఖ పర్యాటక స్థలాలను సందర్శించే పర్యాటకులకు శుద్ధి చేయబడిన తాగునీరు సదుపాయాన్ని అందించేందుకు ప్రసిద్ధ ఫార్మాస్యూటికల్ కంపెనీ దివీస్ సుమారు 30 లక్షల వ్యయంతో కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టియూ - 142 యుద్ధ విమాన మ్యూజియం వద్ద శుద్ధి చేయబడిన తాగు నీరు సదుపాయాల యంత్రాలను విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు , విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ విశాఖకు వచ్చే సందర్శకులు ప్రముఖంగా సందర్శించే పర్యాటక స్థలాల్లో విఎంఆర్‌డిఎ ద్వారా మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు

నవోదయ ప్రవేశ గడువు పొడిగింపు

ప్రజాశక్తి -మధురవాడ : కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ఎంపిక పరీక్ష ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీని ఆగస్టు13వ తేదీ వరకు పొడిగించినట్లు జవహర్ నవోదయ విద్యాలయ విశాఖ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి విశాఖపట్టణం జిల్లాలో ఇప్పటివరకు 5085 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, గత సంవత్సరంలో 9088 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. https://cbseitms.rcil.gov.in/nvs/ ఈ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

65 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలసలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీకృష్ణుడి గుడి వద్ద ఉచిత కంటి, చర్మ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామినాయుడు ఆధ్వర్యాన మధురవాడలోని నియో విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. శిబిరంలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 55 మందికి నేత్ర పరీక్షలు, 10 మందికి చర్మ సమస్యలపై తనిఖీ చేశారు. 10 మందికి అవసరమైన కంటి మందులు ఉచితంగా అందించారు. 15 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారిలో ఐదుగురికి మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీలో ఉచిత ఆపరేషన్ చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో కోరాడ అచ్యుత సాధు రాంబాబు, ఆర్ఎంపి డాక్టర్ కె.నారాయణరావు, నియో విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాలకృష్ణ, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ సుహాసిని, క్యాంప్ మేనేజర్ పవన్ కుమార్, ఆప్టిమిస్టు జ్ఞానేశ్వరి, స్కిన్ అసోసియేట్ లావణ్య, సారిక సత్యనారాయణ, అరవింద్, ఆశా వర్కర్ ఉప్పాడ రాధ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : మానవ అక్రమ రవాణా విషయంపై చంద్రంపాలెం జెడ్పి హైస్కూల్ విద్యార్థులకు బుధవారం 16వ ఎఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ స్వాతి భవాని అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా ప్రమాదాలు, వాటి నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలి.. అపరిచితులు నుంచి ఎలా జాగ్రత్తగా ఉండాలి.. అన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.జనార్ధనరావు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎన్.సూరిబాబు, అడ్వకేట్ మాధవి, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

హౌసింగ్‌పై గ్రామసభ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద గ్రామసభ నిర్వహించారు. హౌసింగ్ పట్టాలు, ఇల్లు నిర్మించిన లబ్దిదారులందరితో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ మాట్లాడుతూ, మౌలిక వసతులు సమకూర్చి నాణ్యమైన ఇళ్లను నిర్మించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పిళ్లా వెంకటరావు, మామిడి దుర్గారావు, జనసేన వార్డు అధ్యక్షులు నరసింహ నాయుడు, ఎంద అప్పారావు, కానూరి అచ్యుతరావు, శివాజీ, వెంకటేష్, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో స్పీచ్ థెరపీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక భవిత కేంద్రంలో 25మంది పిల్లలకు స్పీచ్ థెరపిస్ట్ బాల ఈశ్వరి బుధవారం స్పీచ్ థెరపీ నిర్వహించారు. భాష ఉచ్చరణలో అభివృద్ధి సాధించేందుకు పిల్లలకు మెలకువలు నేర్పారు. వారంలో ఒక రోజు భవిత కేంద్రంలో స్పీచ్ థెరపీ నిర్వహిస్తామని, పిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం ప్రారంభం

శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- ఆరిలోవ : చిప్పాడ దివీస్ లేబొరేటరీ సంస్థ సామాజిక బాధ్యత కింద రూ.22.60 లక్షలతో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఆవరణలో కొత్తగా నిర్మించిన ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని బుధవారం తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ, పాఠశాల విద్యకు మౌలిక వసతుల కల్పనలో ప్రయివేటు కంపెనీల పాత్ర అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశిస్తున్న పి4 విధానం ఇక్కడ దివీస్ సహకారంతో సాకారం అవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ, దివీస్ సంస్థ ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ, తమ సంస్థ ఎల్లప్పుడూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష ఎపిసి టి.చంద్రశేఖర్, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఏషియన్ రోలర్ స్కేటింగ్‌లో దినేష్ ప్రతిభ

ప్రజాశక్తి - ఆనందపురం : దక్షిణ కొరియాలో ఈ నెల 29న జరిగిన 20వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆనందపురం మండలం వెల్లంకి గ్రామానికి చెందిన గొలగాని దినేష్ రెండు విభాగాల్లో వెండి పతకాలు సాధించి భారతదేశానికి ఘనత తీసుకొచ్చాడు. ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగంలోని ఇండివిజువల్ కేటగిరీలో దినేష్ అద్భుత ప్రతిభ చూపి రెండు పతకాలను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇదే పోటీల్లో గత సంవత్సరం చైనాలో జరిగిన 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ దినేష్ వెండి పతకం గెలిచిన విషయం తెలిసిందే.

ఇప్పటివరకు దినేష్ జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిల్లో అనేక విజయాలు సాధించాడు. జాతీయ స్థాయిలో 6 స్వర్ణ పతకాలు, రాష్ట్రస్థాయిలో 15 స్వర్ణ పతకాలు, జిల్లా స్థాయిలో 18 స్వర్ణ పతకాలు గెలిచి తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ విజయాల వెనుక తన తల్లిదండ్రుల పదేళ్ల ప్రోత్సాహం, కృషి, గురువుల మార్గనిర్దేశం ఉందని దినేష్ తెలియజేశారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో భారత్‌కు బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. ఈ సందర్భంగా దినేష్ గురువులు ఇండియా కోచ్ సత్యం, ఆంధ్రప్రదేశ్ కోచ్ చిట్టిబాబు ఆనందం వ్యక్తం చేశారు.

పారదర్శక భూ సేవలపై అవగాహన

భూ సేవలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ బాలకృష్ణ

ప్రజాశక్తి-మధురవాడ : ప్రజలకు భూమిపై న్యాయమైన హక్కు లభించేలా, ప్రభుత్వ భూ సేవలలో పారదర్శకతను తీసుకురావాలనే ఉద్దేశంతో మాధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి బాలకృష్ణ మాట్లాడుతూ, ప్రజలకు ఆటో మ్యుటేషన్, కార్డు ప్రైమ్, దే సాంకేతిక విధానాలు గురించి ప్రాథమికంగా వివరించారు. భూమి రిజిస్ట్రేషన్ అనంతరం రెవెన్యూ రికార్డుల్లో ఆటోమేటిక్ మ్యూటేషన్ జరగడం వల్ల రైతులు, సామాన్యులు ఆఫీసుల చుట్టూ తిరుగాల్సిన అవసరం ఉండదని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ బి. చక్రపాణి మాట్లాడుతూ, ప్రతి వ్యక్తికీ భూమిపై హక్కును ప్రభుత్వమే నేరుగా స్థిరపరచాలన్నది సంకల్పమని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో 2047 నాటికి పూర్తి భూ రికార్డులను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రజలు మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా గురునాథ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -మధురవాడ : పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు గోరే గురునాథ్ జన్మదిన వేడుకలు బుధవారం 6వ వార్డు పరిధి ఆర్‌హెచ్.కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం 130 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెంటకోట బబ్బేలు, పోతిన రాము, కొప్పాక రామకృష్ణ, పిల్లా రమేష్, మామిడి రమణ, పోతిన నాయుడు, దాసు, గవిడి సతీష్, ప్రసాదరావు, రౌతు వెంకటరమణ, భరత్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీచేస్తున్న గురునాథ్

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు సంతపేటలోని అంబేద్కర్ ప్రాథమిక పాఠశాల నుంచి వేరే పాఠశాలలకు బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఎస్ఎంసి చైర్మన్ దండి వెంకటేష్, టిడిపి వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, ఎస్సి సెల్ అధ్యక్షులు ఎం సుబ్బారావు, పార్టీ యూనిట్ ఇంచార్జి కొప్పల కృష్ణ, నరవ రామారావు తదితరులు ఉపాధ్యాయులను సన్మానించారు.

నేరాలు ఘోరాలు

వైసిపి నేత లోవరాజు అరెస్ట్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : మండలంలో వేములపూడి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, జెడ్‌పిటిసి అభ్యర్థి గుడివాడ లోవరాజును అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ గోవిందరావు తెలిపారు. ఈనెల 19న నర్సీపట్నం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ బిల్లా జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలివి. రూ.1.25 కోట్లు విలువైన హైడ్రాలిక్ ప్రొక్లెయినర్‌ను లోన్-కమ్-హైపోథికేషన్ విధానంలో ఫైనాన్స్ ద్వారా లోవరాజు తీసుకున్నారని, అయితే హైపోథికేషన్ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఎక్కువ మొత్తం లభించాలనే దురుద్దేశంతో సంబంధిత హైడ్రాలిక్ ప్రొక్లెయినర్‌ను వేర్వేరు సంస్థల ద్వారా హైదరాబాదు నుండి ముంబయి పోర్టు మీదుగా విదేశాలకు తరలించినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. అందిన ఫిర్యాదు మేరకు విచారించి, నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఉక్కునగరం : కూర్మన్నపాలెం ముస్తఫా జంక్షన్ రామకృష్ణ స్కూల్స్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాహుల్ (28) మృతి చెందాడు. దువ్వాడ నుంచి కూర్మన్నపాలెం వైపు బైక్‌పై వెళుతున్న రాహుల్ గుంతలో పడి కింద పడిపోయాడు. అదే సమయంలో అటుగా వస్తున్న లారీ అతని పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతుడు సినర్జీస్ కంపెనీలో పనిచేస్తున్నట్లుగా తెలుస్తోంది. కణితి కాలనీలో నివాసముంటున్నాడు. గత నెలలోనే అతనికి వివాహమైంది.

రుణాలు పంపిణీచేస్తున్న పిఎసిఎస్ చైర్మన్ అప్పలరాజు తదితరులు

పిఎసిఎస్ చైర్మన్ అప్పలరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని ఆనందపురం శ్రీ వెంకటరంగ సహకార బ్యాంకులో బుధవారం పిఎసిఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) చైర్మన్‌గా పాండ్రంకి అప్పలరాజు, డైరెక్టర్‌గా మీసాల రామునాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పలరాజు మాట్లాడుతూ, బ్యాంక్ అభివృద్ధి, రైతుల సంక్షేమమే తన ప్రథమ లక్ష్యమన్నారు. వ్యవసాయరంగం బలోపేతానికి అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం రైతులకు రూ.30 లక్షల విలువైన రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ ఎస్.నారాయణరావు, స్టాఫ్ అసిస్టెంట్ జయరాం, పంచముకేశ్వరరావు, హేమంత్ సాయి, దొంత ఆచ్చన్న, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న హేమలత

ప్రజాశక్తి- కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధి శారదనగర్ కాలనీలో సుమారు రూ.40 లక్షలతో రోడ్లు, కాలువలు, మెట్లు మార్గాలకు కార్పొరేటర్ మొల్లి హేమలత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. ముఖ్యంగా శారదానగర్, సాయిరాం కాలనీ, శివశక్తి నగర్, అయ్యప్పనగర్ సర్వే నెంబర్ 27 గల కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, మెట్లు మార్గాలు, వీధిలైట్ల పనులు శరవేగంగా చేపడుతున్నామని తెలిపారు. శారదానగర్, సాయిరాంకాలనీ, అయ్యప్ప నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు వివరించారు. అనంతరం కాలనీవాసులు, మహిళలు హేమలతను సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, కూటమి నాయకులు నాగోతి వెంకట సత్యనారాయణ, దేవర శివ, మన్యాల సోంబాబు, కొండపు రాజు, నల్లాన ఆనందరావు, ముచ్చి రామానాయుడు, సూరిబాబు, రమణ, రాజు, సన్నీ, రాజు, శివ, నారాయణ, సూరి, సునీల్, సంతోష్, ఆది, ఈశ్వరావు పాల్గొన్నారు.

అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న కాలేషాసాహెబ్

దేశంలో ప్రజారోగ్యం దుర్భరం

ప్రజాశక్తి-పెందుర్తి: దేశంలో ప్రజారోగ్యం చాలా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుందని నెల్లూరు గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కె.కాలేషా సాహెబ్ పేర్కొన్నారు. పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'హెల్త్ సినారియో ఇన్ ఇండియా' అంశంపై జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌కె.కాలేషా సాహెబ్ మాట్లాడుతూ, ఆరోగ్య విషయంలో శాస్త్రీయ పద్ధతుల్లో కాకుండా మూఢనమ్మకాలు, చాందస భావాలతో ప్రజలను పక్కదారి పట్టిస్తుండటంతో అనేక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఆవు పేడ పూసుకుంటే కరోనా తగ్గిపోతుందని అశాస్త్రీయ విధానాలను ప్రచారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి భావాలకు వ్యతిరేకంగా ప్రజలను, విద్యార్థులు, మేధావులు చైతన్య పరచాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక కృషిని అభినందించారు.

జెవివి రాష్ట్ర కార్యదర్శి జి.మురళీధర్ మాట్లాడుతూ, శాస్త్ర విజ్ఞాన ప్రచారంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.కృష్ణారావు, వైఆర్‌కె.ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌వికె.పరశురాం, కె.శేషగిరిరావు, నాయకులు కెవి.రమణ, శర్మ, కెవి.ప్రసాద్, వాసుదేవరావు పాల్గొన్నారు.

పలుచోట్ల రావి శాస్త్రి జయంతి

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : కలమే ఆయుధంగా బడుగు బలహీనవర్గాల జీవన పోరాటానికి అక్షర రూపం ఇచ్చిన మహా మనిషి రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని పలువురు కొనియాడారు. బుధవారం బీచ్ రోడ్ లోని రాచకొండ విశ్వనాథ శాస్త్రి మెమోరియల్ దగ్గర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రావి శాస్త్రి అభిమానులు, న్యాయవాదులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. రావి శాస్త్రి చిత్రపటానికి ప్రఖ్యాత వైద్య నిపుణులు జి.రఘురామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావిశాస్త్రి నవ సమాజ పద నిర్దేశకుడన్నారు. ఇల్లు, రత్తాలు రాంబాబు వంటి రచనలు న్యాయవ్యవస్థకు నిఘంటువుగా నిలిచాయని తెలిపారు. సగటు మనిషి న్యాయస్థానాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు శాస్త్రి రచనల్లో అద్దం పట్టాయని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ మాట్లాడుతూ, న్యాయ శాస్త్రంతో పాటు సాహిత్యాన్ని సాధారణ ప్రజల జన జీవితాన్ని రచనల ద్వారా అందించిన మహా మనిషిగా కొనియాడారు. రావిశాస్త్రి కుమారుడు కుమార్ శాస్త్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంకె.శ్రీనివాస్, డివి.సూర్యరావు, కెవి.రామ్మూర్తి, కెవి.నరసింహమూర్తి, నమ్మి సన్యాసిరావు, చీమలపాటి శేఖర్ పాల్గొన్నారు. పాండిచ్చేరి పూర్వ మంత్రి కృష్ణారావు హాజరై రావిశాస్త్రి చిత్రపటానికి పూలమాల వేశారు.

విద్యార్థుల ర్యాలీ

రావిశాస్త్రి జయంతిని పురస్కరించుకొని బీచ్ రోడ్‌లో గాయత్రీ విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపల్ డాక్టర్ కె మధురవాణి ప్రారంభించారు. ర్యాలీ బీచ్ రోడ్డులోని రావిశాస్త్రి మెమోరియల్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో రావిశాస్త్రి కుమారుడు కుమార్‌శాస్త్రి, పాఠశాల కార్యదర్శి వేదుల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు గుర్తింపుతో గర్భాశయ కేన్సర్‌కు అడ్డుకట్ట

ప్రజాశక్తి - అరిలోవ : గర్భాశయ కేన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే వ్యాధి ముప్పు నుండి బయటపడవచ్చని ఆరిలోవ అపోలో కేన్సర్ వైద్య నిపుణులు తెలిపారు. గర్భాశయం, అండాశయం కేన్సర్లను ముందుగానే గుర్తించే ఎండిఒ కార్యక్రమాన్ని బుధవారం అపోలో ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సైలెంట్ కిల్లర్‌గా చెప్పబడే అండాశయ కేన్సర్ 55 నుండి 64 ఏళ్ల వయసు మధ్యలో మహిళలకు అధికంగా వస్తుందన్నారు. 2025 నాటికి 1.57 మిలియన్ల కేన్సర్ కేసులు భారతదేశంలో పెరుగుతాయని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. కడుపు ఉబ్బరం, కడుపులో నొప్పి, మలబద్ధకం, జననేంద్రియాల నుంచి రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

స్త్రీ సమానత్వంతో సమాజాభివృద్ధి : ఐద్వా

ప్రజాశక్తి -గాజువాక : స్త్రీ సమానత్వంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ అన్నారు. ఐద్వా గాజువాక జోన్ 9వ మహాసభ శ్రీనగర్‌లోని గురజాడ స్కూల్లో బుధవారం నిర్వహించారు. ఐద్వా సీనియర్ నాయకులు జి.మణి జెండాను ఆవిష్కరించారు. అధ్యక్షవర్గంగా ఎల్.కామేశ్వరి, కె.సంతోషం వ్యవహరించగా, కార్యదర్శి నివేదికను జి.లక్ష్మి ప్రవేశపెట్టారు. అనంతరం బి.పద్మ మాట్లాడుతూ, అనేక రంగాల్లో మహిళలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నారని తెలిపారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు సకల రంగాల్లోనూ స్త్రీలు సమున్నత స్థానాల్లో విశిష్ట కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సరైన అవకాశాలు ఇస్తే మహిళలు మరింత అభివృద్ధి సాధిస్తారన్నారు.

ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, చట్టసభల్లో మహిళలకు నేటికీ సముచిత స్థానం లేదన్నారు. మహిళలపై హింస రోజు రోజుకూ విపరీతంగా పెరుగుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం నివారణ చర్యలు తీసుకోకపోగా మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చి స్త్రీలకు స్వేచ్ఛ ఉండకూడదని చెబుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి దిశగా ఐద్వా పనిచేస్తోందని తెలిపారు. గాజువాక ప్రాంతంలో ఐద్వా బలమైన సంఘంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేరళలో 58 లక్షలు సభ్యత్వం కలిగి ఉందని, అటువంటి వారసత్వాన్ని మనం కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఐద్వా సీనియర్ నాయకులు సుభద్ర మాట్లాడుతూ, సినిమాలు, సీరియళ్లలో మహిళలను విలన్లుగా చూపిస్తున్నారని, వీటిపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని కోరారు.

తీర్మానాలు

మహిళలపై హింస అరికట్టాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని, విశాఖ డెయిరీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తీర్మానాలను దేవి, కల్యాణి,రమణమ్మ ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

మహాసభలో పాల్గొన్న ఐద్వా ప్రతినిధులు

నూతన కమిటీ ఎన్నిక

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం గాజువాక జోన్ నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎల్.కామేశ్వరి, కార్యదర్శిగా జి.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా కె.సంతోషం, జి.మణి, పి.యశోదరాణి, జి.మంగాదేవి, జి.కల్యాణి, సహాయ కార్యదర్శులుగా ఆర్.స్వర్ణలత, డి.రమణమ్మ, ఎం.శ్రీదేవి, కె.మంగవేణి, ఎ.అనసూయ, 12 మంది ఆఫీసు బేరర్లు, మరో 8 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

నేడు 'కరణం' ఉద్యోగ విరమణ

కరణం వెంకట ఈశ్వరరావు దంపతులు

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కరణం వెంకట ఈశ్వరరావు గురువారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఈశ్వరరావు సర్వీస్ కమిషన్ పరీక్ష పాసై 1986లో నవంబర్ 12వ తేదీన టైపిస్టుగా ఉద్యోగం సాధించారు. ఉమ్మడి విశాఖ జిల్లా కొయ్యూరు మండలం రెవెన్యూ ఆఫీసర్‌గా, 1998లో విశాఖ అర్బన్ రెవెన్యూ ఆఫీసర్‌గా, 2007లో డిప్యూటీ తహశీల్దార్‌గా, అసిస్టెంట్ తహశీల్దార్‌గా, 2017లో తహశీల్దార్‌గా పదోన్నతులు పొందారు. పాయకరావుపేట, సీతమ్మధార, భీమిలి, ఆనందపురం, పార్వతీపురం తదితర ప్రాంతాల్లో తహశీల్దార్‌గా పనిచేశారు.

తల్లిదండ్రులు కరణం వెంకట్రావు, సుబ్బరావమ్మకు వెంకట ఈశ్వరరావు జన్మించారు. తండ్రి నేర్పిన నీతి నిజాయతీతో ఉద్యోగం వచ్చిన తర్వాత ఎక్కడా రాజీ పడకుండా పనిచేసి పలువురి మన్ననలు పొందారు. ఎక్కడ పనిచేసామన్నది ముఖ్యం కాదు.. పని చేసిన చోట ప్రజలకు ఎంత సేవ చేసామన్నది ముఖ్యమని ఈశ్వరరావు చెప్పేవారు. తోటి ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉండేవారు. పనిచేసిన చోట ఎన్ని ఒత్తిడిలు ఎదురైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకునేవారు. ఈశ్వరరావుకు భార్య వరలక్ష్మి, కుమార్తె స్వాతి, అల్లుడు సూర్యనారాయణమూర్తి, మనవరాలు శాన్వి ఉన్నారు.

1 నుంచి తూనిక యంత్రాల ముద్రణ రుసుం పెంపు

ప్రజాశక్తి-సీతమ్మధార : తూనిక యంత్రాలకు విధించే ముద్రణ రుసుము దాదాపు 50 శాతం మేరకు ఆగస్టు 1వ తేదీ నుంచి పెంచనున్నట్లు డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 25వేల దుకాణాలు ఉన్నాయని, ప్రస్తుతం వాటి నుంచి సంవత్సరానికి రూ.3 కోట్లు వసూలవుతుందని, తాజా పెంపు వల్ల మరో రూ.2కోట్లకు పైగా ఆదాయం పెరగవచ్చని తెలిపారు. తూనికల కొలతల శాఖలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వ్యాపారులు, దుకాణదారులు, పరిశ్రమల నిర్వాహకులు ఎవరైనా కాటాల పునరుద్ధరణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అందులో వివరాలు నమోదు చేస్తే రుసుం ఎంత చెల్లించాలో చూపిస్తుందని వివరించారు. ఆ మొత్తం చెల్లించాక పూర్తయిన దరఖాస్తు సంబంధిత అధికారి వద్దకు చేరుతుందని, అనంతరం సదరు అధికారి దుకాణంలో తనిఖీలు నిర్వహించి అన్ని సక్రమంగా ఉంటే ఆన్‌లైన్‌లో ఆమోదించి వ్యాపారులు ఇచ్చిన మెయిల్‌కు ధ్రువీకరణ పత్రం పంపుతారని తెలిపారు.

క్రికెట్ పోటీలో వైజాగ్ సిటీ పోలీస్ టీమ్ విజయం

ప్రజాశక్తి-మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం ఎసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ ఫైనల్లో నగర సిటీ పోలీస్ టీమ్ విజేతగా నిలిచింది. ఎపిఇపిడిసిఎల్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం సిటీ పోలీస్ క్రికెట్ జట్టు 52 రన్స్ తేడాతో ఘన విజయం సాధించింది. విడిసిఎ నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీస్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లకు 208/06 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎపిఇపిడిసిఎల్ క్రికెట్ టీమ్ 17.3 ఓవర్లలో 156 పరుగులకు ఆలౌట్ అయింది. సిటీ పోలీస్ జట్టులో టి.రాజు 96, ఎం.సంతోష్ 43 పరుగులు చేశారు.

మెడికవర్‌లో సంక్లిష్ట కేన్సర్ సర్జరీ

ప్రజాశక్తి - ఆరిలోవ : మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు అత్యంత సంక్లిష్టమైన కేన్సర్ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్లు సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ చంద్ర వల్లం తెలిపారు. 58 ఏళ్ల మహిళకు సోకిన 'సూడోమైక్సోమా పెరిటోనియై' (పిఎంపి) అరుదైన పొత్తికడుపు కేన్సర్‌కు, సైటోరెడక్టివ్ సర్జరీతో పాటు హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కెమోథెరపీ (హెచ్‌ఐపిఇసి)ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. పొత్తికడుపు ఉబ్బరం, త్వరగా కడుపు నిండినట్లు అనిపించడంతో రోగి మెడికవర్‌ను సంప్రదించారని, పరీక్షల్లో పొత్తికడుపు కుహరంలో శ్లేష్మపు నిక్షేపాలు ఉన్నట్లు వెల్లడైందని వివరించారు. బయాప్సీలో లో-గ్రేడ్ అపెండిసియల్ మ్యూసినస్ నియోప్లాసం (ఎల్‌ఎఎంఎన్) ఉన్నట్లు నిర్ధారణ కావడం, కణితులు విస్తృతంగా వ్యాప్తి చెందడం వల్ల సంప్రదాయ కీమోథెరపీకి స్పందించక పోవడంతో వైద్య బృందం గరిష్ట సైటోరెడక్టివ్ సర్జరీ, ఆపై హెచ్‌ఐపిఇసి చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అత్యాధునిక చికిత్సా విధానం దేశంలోని కొన్ని అడ్వాన్స్‌డ్ కేన్సర్ సెంటర్లలో మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

ధన్యజీవి ఎన్‌వి.రమణ

సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి -ములగాడ : ధన్యజీవి నగిరెడ్డి వెంకటరమణ అని పలువురు వక్తలు కొనియాడారు. జివిఎంసి 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన నగిరెడ్డి వెంకటరమణ సంతాప సభ నిర్వహించారు. ఎన్‌వి.రమణ చిత్రపటానికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. క్రాంతి నగర్ సిపిఎం శాఖ కార్యదర్శి ఎం.ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ, ఎన్‌వి.రమణ డివైఎఫ్‌ఐ కార్యకర్తగా, సిఐటియు నాయకునిగా, క్రాంతి నగర్ శాఖకు కార్యదర్శిగా పనిచేసి ప్రజలకు అనేక సేవలు అందించారన్నారు. డివైఎఫ్‌ఐ, సిపిఎం కార్యకర్తలను తయారు చేశారని గుర్తుచేశారు. సిపిఎం పోరాటాలు, ఉద్యమాల్లోనూ చురుకుగా పాల్గొని ముందుండే వారని తెలిపారు. రమణ ఆశయాలు నెరవేరాలంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రమణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు.

ఎన్‌వి.రమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు

సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ, ఎన్‌వి.రమణ లేని లోటు పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటన్నారు. ఈ సంతాప సభలో సిపిఎం, సిఐటియు, డివైఎఫ్‌ఐ, ఐద్వా, కుటుంబీకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, వి.బాబూరావు, ఎస్.ప్రసాద్, ఎస్.వాసు, జి.నరేష్, డి.గోపాల్, ఎన్.శ్రీనివాసరావు, కొల్లి రాము, నవీన్, రామకృష్ణ, ప్రేమ, సమీర్, దాసు, కోటి, ఏసుబాబు, తాత, బుజ్జి, వెంకటేష్, ఎం.జయలక్ష్మి, పి.వరలక్ష్మి, పి.దొడ్డమ్మ, ఎన్.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోపై ఎమ్మెల్యే తప్పుడు ప్రకటన సరికాదు

- రద్దయినట్టు బండారు అబద్ధాలు
- తక్షణం ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న డిమాండ్

ప్రజాశక్తి-దేవరాపల్లి

రైవాడ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో అదాని హైడ్రో పవర్ ప్లాంట్‌లకు అనుమతులను ప్రభుత్వం రద్దు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఎటువంటి ఆధారాలు లేకుండా మంగళవారం సభాముఖంగా ప్రకటించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. దీనికి రైవాడ ఆయకట్టు రైతులకు, ప్రాజెక్టుల ప్రభావిత ప్రాంతాల గిరిజనులకు ఎమ్మెల్యే బండారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం స్థానిక ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కర్రివలస, కురుకుట్టి గ్రామాల పరిధిలో రెండు హైడ్రో పవర్ ప్లాంట్లుకు గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తూ ఈనెల 28న ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. దీనిని స్థానిక ఎమ్మెల్యే వక్రీకరించి చింతపూడి (మారిక), రేగులపాలెం ప్రాజెక్టులు అనుమతులు రద్దు చేసినట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన రాష్ట్ర గిరిజన శాఖమంత్రి పట్టుబట్టి అక్కడ గిరిజనులకు నష్టం కలుగకుండా పవర్ ప్లాంట్లు అనుమతులు రద్దు చేయించుకోవడం జరిగిందని, కాని ఇక్కడ ప్రజా ప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు నోరు మెదపకపోవడంతో రైవాడ రిజర్వాయర్‌పై ప్రాజెక్టులు రద్దు చేయలేదని స్పష్టం చేశారు. రైవాడకు ఎక్కడ నుండి, ఏ నదులు నుండి నీళ్ళు వస్తున్నాయో కూడా కూటమి నాయకులకు తెలియదని, ఆ విషయాలు, అదాని హైడ్రో పవర్ ప్లాంట్‌లకు ఎక్కడ అనుమతులు ఇచ్చారు అన్న విషయాలు ఇప్పటికైనా కూటమి నాయకులు తెలుసుకోవాలని హితవుపలికారు. ఎటువంటి అవగాహన లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడటం దారుణమన్నారు.

దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం, అనకాపల్లి, మునగపాక, యలమంచిలి, రాంబిల్లి తదితర మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు, గ్రేటర్ విశాఖ ప్రజలకు తాగు నీటిని అందిస్తున్న రైవాడ ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో అదాని హైడ్రో పవర్ ప్లాంట్లు ఏర్పాటుకు గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టులు పెదకోట (రేగులపాలెం) వద్ద 1800 మెగావాట్లు, చింతలపూడి (మారిక) పంచాయతీ పరిధిలో శారదానదిపై 900 మెగా వాట్లు సామర్థ్యం పెంచుకోవడానికి గత నెల 30వ తేదీన జివో నెంబర్ 51ని విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే భవిష్యత్‌లో రైవాడ ఆయకట్టు రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మార బోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలు, ఇతర పేదలను వారి ఆవాసాల నుంచి వెళ్లగొట్టబడతారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను ఒక పక్క గిరిజనులు ప్రతిఘటిస్తున్నారని, వారి పోరాటాలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, షెడ్యూల్ ఏరియాలోని పీసా, అటవీ హక్కుల చట్టాలకు విరుద్ధంగా అదాని హైడ్రో పవర్ ప్లాంట్‌లకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం దుర్మార్గమన్నారు. ఈ హైడ్రోపవర్ ప్రాజెక్టుల అనుమతులపై స్థానిక ఎమ్మెల్యే బండారు, ఎంపీ సీఎం రమేష్ బాధ్యత వహించాలని, దీనిపై వారి వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని రాయిపుర అగ్రహారం, బంగారమ్మపాలెం, ఆరిపాక పంచాయతీలలో 1 కోటి 12 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన సిసి రోడ్లు, బీటీ రోడ్లు, సిసి డ్రైనలు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పినగాడి నుండి వేపగుంట వరకు తారు రోడ్డు, అసకపల్లి నుండి లంకెలపాలెం వరకు తారు రోడ్డు, ఆరిపాక నుండి మారిటైమ్ యూనివర్సిటీ వరకు ఏడు కోట్లు నిధులతో తారు రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, నాయకులు ఇందల వెంకట రమణ, మిడతాడ మహాలక్ష్మి నాయుడు , బలిరెడ్డి రామకృష్ణ, మండలం వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మి రాణి రాము, ఎంపిటిసి బైలపూడి దేముడు బాబు, బంతి కోళ్ల పద్మ, సర్పంచులు బోకం స్వామినాయుడు, కర్రి నరసింగరావు, పడాల వెంకటరమణ, దాడి లావణ్య కన్నమనాయుడు, ఆకుల గణేష్, పిల్లల అప్పలనాయుడు, గొర్లి కుమార స్వామి, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, కంచిపాటి రాంబాబు, రాపేటి అరుణ రాము, దొడ్డి సూర్యప్రకాశరావు, టి.శేఖర్, జెట్టి అప్పలరాజు, పల్లి మంగరాజు, కాళ్ల శ్రీను, ఆడారి వెంకట్, ఆడారి నాగరాజు, మళ్ల వెంకటరమణ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కపోతతో విలవిల

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : విపరీతమైన ఎండ.. దానికి తోడు ఉక్క పోతతో ప్రజలు విలవిలలాడారు. బుధవారం ఉదయం నుండి విపరీతమైన ఎండకాసింది. అయితే గాలి లేకపోవడంతో పాటు విపరీతంగా ఉక్కపోత ఉండడంతో ప్రజలు ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రంగా కాసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేసవిని తలపించే వాతావరణం ఉండడంతో మండల వాసులు ఉక్కపోతకు గురయ్యారు.

ఎరువుల కృత్రిమ కొరతపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : ఎరువులు విత్తనాలను నల్ల బజారుకు తరలిస్తూ, కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ యంత్రాంగం సరిగా పట్టించుకోవడం వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరలకు ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తుందని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అధిక ధరలకు నల్ల బజారులో అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకొని వారి లైసెన్సులు రద్దు చేస్తే తప్ప దందా ఆగదని పేర్కొన్నారు.

బెల్ట్ షాపులు తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాల్లో కల్లుగీత కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్న మద్యం బెల్ట్ షాపులను తొలగించాలని కోరుతూ ఏపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర దేవుడు ఆధ్వర్యాన గీత కార్మికులు స్థానిక సిఐటియు కార్యాలయం నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయంలోని రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు త్రిమూర్తులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్ర దేముడు మాట్లాడుతూ మండలంలోని దాలివలస, పింద్రంగి, గొండుపాలెం, ఆర్‌వై అగ్రహారం తదితర గ్రామాల్లో 8 నుండి 12 లక్షల వరకు బ్రాందీ బెల్ట్ షాపులు వేలం ద్వారా అమ్మకాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. దీంతో కల్లుగీత కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, కాని నేడు అనేక గ్రామాల్లో పంచాయతీల వేలం ద్వారా బ్రాందీ బెల్ట్ షాపులు గుడి బడి తేడా లేకుండా రాత్రి పగలు అమ్మకాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శెట్టి రమణ, కండిపల్లి సహదేవుడు, అప్పలరాజు, శ్రీనివాసరావు, మహాలక్ష్మి, దేవునాయుడు, గీత కార్మికులు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కల్లుగీత కార్మికులు

పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-పరవాడ : పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బిఆర్‌విఆర్.కృష్ణంనాయుడు అన్నారు. పరవాడ భవిత కేంద్రంలో బుధవారం తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న ప్రత్యేక శిక్షణలు, అభ్యాస పద్ధతులు, వికలాంగ విద్యార్థుల అవసరాల కోసం తీసుకుంటున్న చర్యలపై వివరంగా చర్చించారు. అనంతరం భవిత కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. 'ది లూమోస్ స్టోర్' సంస్థ సహ వ్యవస్థాపకులు తమ మొదటి లాభాన్ని వినియోగించి భవిత కేంద్రంలోని వికలాంగ బాలల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఓ సాయి శైలజ, వి.కృష్ణవంశీ, జి.రాజశేఖర్, వై.ఉమామణిదీప్, టి.పవన్‌కుమార్, భవిత ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్.జగన్‌ను కలిసిన పైల శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పరవాడ : విజయవాడ తాడేపల్లిలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌ను ఆ పార్టీ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పైల శ్రీనివాసరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో జగన్‌ను ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకంతో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, అనకాపల్లి పార్లమెంట్ సహాయ పరిశీలకుడిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పార్టీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, పార్టీ పిఎసి సభ్యులు బూడి ముత్యాలనాయుడు తదితరులకు ధన్యావాదాలు తెలియజేశారు. తనకుకు అప్పగించిన బాధ్యతలను నిస్వార్థంగా నిర్వహిస్తానని శ్రీనివాసరావు చెప్పారు.

వైఎస్.జగన్‌ను కలిసిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు

చదువుతోపాటు వివిధ అంశాల్లో రాణింపు

మరుగుదొడ్లుకు మరమ్మతులు చేసిన దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు వివిధ అంశాల్లో తర్ఫీదు ఇస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. హాస్టల్స్ అంటేనే భయపడే పరిస్థితి నుంచి కార్పొరేటు స్కూళ్లకు దీటుగా అభివృద్ధి పరుస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో 21 ప్రీమెట్రిక్, ఆరు పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ ఉన్నాయి. ప్రీమెట్రిక్‌లో 3,500 మంది, పోస్ట్ మెట్రిక్‌లో 800 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్ భవనాలు ఇటీవల వరకు మరమ్మతులకు నోచకుండా, స్లాబ్ పెచ్చులు ఊడి, ప్రహరీ గోడలు లేక, వర్షానికి కారుతూ ఉండేవి. జిల్లా యంత్రాంగం వీటిపై దృష్టి సారించి మరమ్మతులు చేపట్టండి. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా, ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ద్వారా వీటికి మరమ్మతులు చేపట్టింది. 14 బాలుర హాస్టల్స్, 13 బాలికల హాస్టల్స్ 4 కోట్ల 22 లక్షల 15 వేల రూపాయలతో మరమ్మతులు చేపట్టింది. సిఎస్ఆర్ ఫండ్స్ రూ.71 లక్షలతో జిల్లాలో మూడు హాస్టళ్లకు తలుపులు, కిటికీలు, పెయింటింగ్‌లు చేపట్టారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద 49 లక్షల 11 వేల రూపాయలతో ఏడు హాస్టళ్లకు ప్రహరీ గోడలు నిర్మించారు. వీటితో పాటు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ద్వారా ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో 57 బాత్రూమ్‌లు ఒక్కొక్కటి రూ.3 లక్షల చొప్పున కోటి 71 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నారు. వీటితో పాటు ప్రతి హాస్టల్‌కు రూ.1,58,000తో కావలసిన మిక్సీలు, గ్రైండర్లు, టబ్స్, ప్లేట్లు, ట్రంకు బాక్సులు, కిచెన్ ఐటమ్స్, స్పోర్ట్స్ మెటీరియల్, విద్యార్థులకు టవల్స్, ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్ అందిస్తున్నట్లు జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి తెలిపారు. ప్రతి హాస్టల్లో విద్యార్థులకు చదువుతో పాటు వివిధ క్రీడలు, యోగ, ధ్యానం, స్టడీ అవర్ల నిర్వహిస్తున్నారు.

సుందరంగా వేములపూడి వసతి గృహం

హాస్టలంటే మంచి అభిప్రాయం కలగజేస్తున్నాం

విద్యార్థుల్లో హాస్టల్ అంటే గతంలో ఉన్న తక్కువ భావన ఉండేది. దానిని తొలగించి అన్ని సౌకర్యాలు మెరుగు పరచడంతో తమ ఇంటి కంటే హాస్టల్‌లోనే బాగుందనే ఆలోచన కలగజేస్తున్నాం. చదువు, క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు చేస్తున్నాం.

- రామానందం, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి



కుమార్ రాజాకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా కుమార్ రాజా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్ రాజా జన్మదిన వేడుకలు బుధవారం మండలంలోని ఏఎస్ పేటలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలశాల రమణారావు, జెడ్పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నడిశెట్టు మధు, వాసుపల్లి తాతీలు, కె. వెంకటసాంబశివ, నాయకులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా తుమ్మపాల సెక్షన్, 33/11 కెవి అల్లికానుడిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలలో ఆగస్టు 1న ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, 24 గంటల పాటు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని కసింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్సిడీపై పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని నరసింగబిల్లి పశు వైద్య కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీపై పశుదానాను బుధవారం పశు వైద్య అధికారి ఆల్ఫాన్స్ జార్జ్ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ దర్గా, మాజీ సర్పంచ్ మజ్జి ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ బల్ల అప్పలకొండ, జెర్రిపోతుల నూకు నాయుడు, సిబ్బంది రాజేష్, రాగువీర్ భవాని, సచివాలయం సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు.

జనమిత్ర మహాజన సభ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జనమిత్ర పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం 30వ మహాజన సభ సంఘం చైర్‌పర్సన్ కరణం కాంతమ్మ అధ్యక్షతన మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో కెఎస్ఆర్ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆవరణలో బుధవారం జరిగింది. సంఘం నివేదికను బ్యాంక్ ఆఫ్ ఇండియా అచ్యుతాపురం బ్రాంచ్ మేనేజర్ ఎస్ విజయకుమార్, మునగపాక ఎంపిపి మళ్ల జయలక్ష్మి, సంఘ ఎండి కర్రి రమేష్ బాబు, సంఘ చైర్పర్సన్ కరణం కాంతమ్మ చేతుల మీదుగా విడుదల చేశారు. సంఘంలో పదివేల మంది సభ్యులతో రూ.40 కోట్లు టర్నోవర్ చేస్తున్నట్లు కర్రి రమేష్ బాబు చెప్పారు.

వార్షిక నివేదిక విడుదల చేస్తున్న సంఘం ప్రతినిధులు

సోషల్ ఆడిట్ సమన్వయ సమావేశం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద 18వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి కో-ఆర్డినేషన్ సమావేశం బుధవారం బుచ్చయ్యపేట మండల పరిషత్తు సమావేశం మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భానోజీరావు మాట్లాడుతూ 35 గ్రామ పంచాయతీలలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంతో పాటు పంచాయతీ రాజ్, సోషల్ ఫారెస్ట్రీ, స్కూల్ ఎడ్యుకేషన్, హౌసింగ్ డిపార్ట్మెంట్లకు సంబంధించి 1604 పనులకు సంబంధించి రూ.27.28 కోట్లకు ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు కూడా ఆడిట్ చేస్తామన్నారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, రాజకీయపక్షాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు, రాజకీయ పార్టీల నేతలు

చెరువు గర్భంలో చెట్లు వేలం పాట అడ్డగింత

- మర్రిపాలెం గ్రామానికి వాటా ఇవ్వకపోవడంపై ఆ గ్రామస్తుల ఆగ్రహం
- ఆగస్టు 13వ తేదీకి వేలం పాట వాయిదా

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని అయ్యన్నపాలెం పంచాయతీ పరిధిలోని భూదేవి చెరువు గర్భంలో గల కలప చెట్లు వేలంపాటను మర్రిపాలెంకు చెందిన ఆయకట్టు రైతులు బుధవారం అడ్డుకున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... అయ్యన్నపాలెం గ్రామంలో సుమారు 136 ఎకరాలల్లో భూదేవి చెరువు గర్భం ఉంది. ఈ చెరువు నీరు అయ్యన్న పాలెం, బోదువలస, ఎల్లుప్పి, గుల్లేపల్లి పంచాయతీలకు చెందిన సుమారు 500 ఎకరాల ఆయకట్టు పంట పొలాలకు సాగునీరు అందుతుంది. సుమారు రెండువేల మంది ఆయకట్టు రైతులు ఉన్నారు. ఈ భూదేవి చెరువు గర్భంలో ఉన్న సరుగుడు తోట, తుమ్మ చెట్లు, తెల్లమద్ది చెట్లు, ఆకేషి చెట్లు, నీలగిరి చెట్లు, టేకు చెట్లతో పాటు చేపలు పెంపకం ద్వారా వచ్చిన ఆదాయం అయ్యన్నపాలెం పంచాయితీకి రెండు వాటాలు, ఎల్లుప్పి పంచాయితీ పరిధి మర్రిపాలెం గ్రామానికి ఒక వాటా చొప్పున పంపకం చేసుకోవడం పూర్వీకుల నుండి ఆనవాయితీగా వస్తుంది.

భూదేవి చెరువు గర్భంలోని సుమారు 1758 సరుగుడు చెట్లు వేలం పాటకు అయ్యన్న పాలెం గ్రామ పెద్దలు, ఆయకట్టు రైతులు సిద్ధమయ్యారు. అంతేకాకుండా తమ పంచాయతీ రెవెన్యూ పరిధిలో భూదేవి చెరువు ఉందని, చెరువు గర్భంలో ఉన్న కలప, చేపలు పెంపకం నుండి వచ్చిన ఆదాయం తమ పంచాయతీకే చెందుతుందని, మర్రిపాలెం గ్రామానికి చెందిన రైతులకు ఇవ్వబోమని అయ్యన్న పాలెం ఆయకట్టు రైతులు ప్రకటన చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన మర్రిపాలెం ఆయకట్టు రైతులు ఈ కలప చెట్లు వేలంపాటను బుధవారం అడ్డుకున్నారు. వేలంపాటకు ఈఓపిఆర్డి చైతన్యతో పాటు సిఐ జి.రామచంద్రరావు, ఎస్ఐ పి.సింహాచలం, పోలీస్ సిబ్బంది, హాజరయ్యారు. అయ్యన్న పాలెం గ్రామ పెద్దలు స్వార్థ పూరిత లబ్ధికోసం వేలంపాటను నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నట్లు మర్రిపాలెం గ్రామస్తులు ఆరోపించారు. భూదేవి చెరువు సాగునీటి సంఘం ఆధ్వర్యంలో వేలం పాట జరగాలని వారు డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు ఆయకట్టు రైతుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో భూదేవి చెరువు గర్భంలో గల కలప చెట్లు వేలం పాట ఆగస్టు 13కు వాయిదా వేస్తున్నట్లు ఈఓపిఆర్డి చైతన్య ప్రకటన చేశారు. దీంతో మర్రిపాలెం రైతులు శాంతించారు. చెరువులో కలపను వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలని మర్రిపాలెం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యన్నపాలెం సర్పంచ్ బుదిరెడ్ల లక్ష్మీకనకరాజు, మాజీ ఉప సర్పంచ్ తుమ్మపాల నానాజీ, భూదేవి చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు దొగ్గ కనక చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యక్షులు బల్లిన చంద్రరావు, డైరెక్టర్లు కర్రి రాంబాబు, దొగ్గ రామకృష్ణ, అమరపిన్ని నరసింగరావు, బంధం అప్పలస్వామి, గ్రామ పెద్దలు తుంపాల శివ, తుంపాల కోటేశ్వరరావు, పొంతపల్లి అప్పలరాజు, ఉగ్గిన గంగు నాయుడు, అల్లం రామనాయుడు, పలువురు మహిళలు, అధిక సంఖ్యలో ఆయకట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటను అడ్డుకొని నిలదీస్తున్న మర్రిపాలెం గ్రామస్తులు

నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం నుండి అనకాపల్లి మండలం కోడూరులో ఏర్పాటు చేస్తున్న ఏపీఐఐసీ ఆటోనగర్ పార్కుకు నిర్మిస్తున్న వంద అడుగుల రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గండి బాబ్జి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఏపీఐఐసీ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందిన బొబ్బరి సత్యారావు, తాతారావు, శ్రీను, అప్పారావు, సూరిబాబు, చినబాబు కుటుంబ సభ్యులకు కోడూరు రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ ఒకటిలో ఎకరా 86 సెంట్లు భూమి పోయిందని, వారికి 4సి రెవిన్యూ రికార్డులలో పేర్లు నమోదయ్యాయని, వారికి నష్ట పరిహారం గాని, టిడీఆర్ బాండ్లు గాని వెంటనే చెల్లించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని బాబ్జీ డిమాండ్ చేశారు. ఆటో నగర్ పార్కుల్లో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.30 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చారని, రోడ్డు నిర్మాణానికి పోతున్న భూములకు అంత పరిహారం ఎందుకు ఇవ్వరని బాధిత రైతులు ప్రశ్నించారు. తమకు పరిహారం ఇవ్వకుంటే రోడ్డు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. టిడిపి నేతలు గండి ముత్యాల నాయుడు, బలిరెడ్డి అప్పారావు, గొంప సత్యనారాయణ, దాసరి వెంకటరమణ, బొబ్బరి కన్నారావు, బర్ల రమణ కోరాడ శ్రీనివాసరావు, రెడ్డి దేవుడు బాబు పాల్గొన్నారు.

సామాజిక భవన అభివృద్ధికి స్థలాల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 83వ వార్డ్ వైయస్సార్ అపార్ట్మెంట్, ఎఎంసి కాలనీలో సామాజిక భవన నిర్మాణానికి స్థలాలను వైఎస్ఆర్‌సిపి యువజన విభాగం జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ బుధవారం పరిశీలించారు. 83వ వార్డు సచివాలయం మేడపై ఉన్న స్థలాన్ని, ఏఎంసి కాలనీలో ఉన్న జీవీఎంసీ స్థలాన్ని పరిశీలించారు. ఏఎంసి కాలని నుండి లక్ష్మీ దేవీపేట రైల్వే గేటు మధ్య యల్లయ్య కాలువపై వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని రమేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ అధికారి కుమార్, 5వ సచివాలయం ఇమ్యూనిటీ సెక్రటరీ గణేష్, మాజీ కౌన్సిలర్ నడిశెట్టి మధు, బండి ఆనంద్, నడిశెట్టి గోవింద, రెడ్డి చిన్న, కటారి మనోజ్, పాల్గొన్నారు.

పెరుగు బజారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్నాళ్ళుగానో నిలిచిపోయిన పెరుగుబజార్ జంక్షన్ రహదారి నిర్మాణం పనులను తక్షణమే పూర్తి చేయాలని సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పెరుగు బజార్ వద్ద నిరసన తెలిపారు. పెరుగు బజార్ జంక్షన్ నుండి రైల్వే స్టేషన్ మార్గాన్ని గత ప్రభుత్వంలో 55 అడుగుల వెడల్పు చేసే ప్రక్రియలతో నిర్మాణ అభివృద్ధి పనులను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వినకోట నీలేషుగుప్తా, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, సభ్యులు ఊడా నాగేశ్వరావు, స్థానికులు పాల్గొన్నారు.

డాక్టర్ నారాయణరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ సర్జన్ కళ్యాణి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ కేకేవిఎ నారాయణరావు జన్మదిన వేడుకలు బుధవారం హాస్పిటల్ వద్ద పౌర్ణమి సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కర్రి సన్యాసినాయుడు, పెతకంశెట్టి ఆదికోటి, ఆడారి శివాజీ, బొడ్డేడ కాశీ, దాడి ఈశ్వరరావు,కర్రి సుబ్రహ్మణ్యం, పిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి టీ షర్టుల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డులో పనిచేస్తున్న శానిటరీ కార్మికులకు ప్రత్యేకంగా టీ షర్టులు బుధవారం ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరీ సిబ్బంది కొద్ది మంది మాత్రమే పనిచేస్తుండడంతో పలు వీధుల్లో పనులు ఆలస్యమవుతున్నాయని, దీంతో సిబ్బందిపై పని భారం పెరుగుతోందని తెలిపారు. ఈ విషయంపై మేయర్‌తో చర్చించి, కొత్త సిబ్బంది నియామకంపై హామీ పొందినట్లు చెప్పారు. త్వరలోనే కొత్త సిబ్బంది వచ్చే అవకాశముందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి పోలిరెడ్డిపాలెం తారకరామ కాలనీలో ఎన్టీపీసీ సిఎస్ఆర్ ద్వారా మంజూరు చేసిన రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివలంక లక్ష్మీ, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, కొండ్రపు శ్రీను, పోలవరపు మంగ, వియ్యపు ముత్యాలు, కూండ్రపు అప్పారావు, రమణమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామానందం

స్కాలర్ షిప్ సమస్యలుంటే తెలియజేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని ఐటిఐ, ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మసీ కళాశాలలో విద్యార్థుల స్కాలర్ షిప్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ ఎంపవర్మెంట్ అధికారి బి.రామానందం అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో డిస్ట్రిక్ట్ లెవెల్ ప్రిన్సిపాల్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామానందం మాట్లాడుతూ స్కాలర్ షిప్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లాలోని 100 మంది ప్రిన్సిపాల్స్ వారి ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర ద్వారా రూ.15000 ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు జి దేవుడు బాబు, రెడ్డి అప్పలనాయుడు, కాసుబాబు, ఆటో యూనియన్ నాయకులు ఎ.దేవుడు, దుర్గనాయుడు, వెంకట్రావు, ఇల్లాకు రమణ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యులు వేపాడ చిరంజీవి రావుకు బుధవారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాల సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటన నుండి రాగానే పరిష్కరిస్తామని, 2003 డీఎస్సీకి ఓ పిఎస్ అమలు చేసే విధంగా చర్యలు చేపడతామని చిరంజీవిరావు హామీ ఇచ్చారు. సింగిల్ టీచర్ల విషయంలో ఇబ్బంది కలగకుండా క్లస్టర్ టీచర్లను నియమించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్రీదేవి, తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనుబాబు, ఎంవీ నూకేష్, వరప్రసాద్, విద్యాసాగర్, రమా, అప్పలనాయుడు, రాజా రమేష్, పివికెయం లక్ష్మీ, ఉమాబాల, దొర శ్రీనివాస్, పోతల శివ, ఎల్ నాయుడు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

పిఎసిఎస్ పర్సన్ ఇన్‌ఛార్జిని సత్కరిస్తున్న బండారు

ప్రజాశక్తి -మాడుగుల: ప్రభుత్వం ఇచ్చిన పదవులతో ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. బుధవారం ఎం. కోటపాడు పిఎసిఎస్ పర్మన్ ఇన్‌ఛార్జి పిల్లా నాయుడు, డైరెక్టర్లు గెంజి కొండలరావు, అడపా రాజుబాబు ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్చార్జి రాయపురెడ్డి కృష్ణ అధ్యక్షతనలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పిఎసిఎస్ పర్శన్ ఇన్చార్జి పదవి ఎంతో కీలకమైనదని, తగు జాగ్రత్తలు పాటిస్తూ రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సేవలను అందించాలని కోరారు. పిఎసిఎస్ కార్యదర్శి బొట్టేటి లక్ష్మణరావును సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఎఎంసి చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండల కార్యదర్శి నందారపు సన్యాసిరావు, పుప్పాల రమేశ్, నానాజీ, సురేఖ, నాలుగు పాల్గొన్నారు. అంతకుముందు ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో గ్రీన్ యాపిల్ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో మేలు

ప్రజాశక్తి -మాడుగుల: వ్యవసాయంలో ఆధునిక యాంత్రీకరణ పద్ధతులతో రైతులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం మండలంలోని ఎం.కోటపాడు గ్రామంలో పంటలకు మందును పిచకారి చేసే డ్రోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న కాలంలో రైతులు యంత్రాలతో వ్యవసాయం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై పరికరాలను అందజేస్తున్నాయన్నారు..ఇది వరకే మండలంలోని పవర్ టిల్లర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, దమ్ము సెట్లు రైతులకు అందించామన్నారుడ్రోన్ ఉపయోగించి ఎకరాకు పురుగుల మందును 6 నిమిషాల్లో పిచికారీ చేయొచ్చన్నారు మండల వ్యసాయశాఖ అధికారిణి అనసూయ డ్రోన్ పనితీరుపై వివరించారు.కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్త బి నాగేంద్రప్రసాద్, వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్, ప్రకతి వ్యవసాయ సిబ్బంది భవాని అన్నారు. మండలంలో దేవవరం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ద్రవ, ఘన జీవామృతం , వేప గింజల కషాయంపై రైతులకు అవగాహన కల్పించారు. జీవామృతం వాడటం వల్ల పురుగులు, తెగుళ్ల నివారించడంతోపాటు, మొక్క పెరుగుదలను మెరుగుపరుస్తుందన్నారు. వేప గింజల కషాయం తయారీ, ప్రయోజనాలను వివరించారు.. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేసి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల రాఘవ కుమారి, నరసింహమూర్తి, ఆత్మ సిబ్బంది సత్యవేణి, ప్రకతి వ్యవసాయ సిబ్బంది తాసుబాబు, అప్పారావు, గ్రామ పెద్దలు ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : దుకాణాల వద్ద తప్పనిసరిగా డస్ట్ బిన్ లు ఏర్పాటు చేసుకోవాలని ఎంపిడిఒ డి సీతారామరాజు సూచించారు. బుధవారం మండలంలో సిహెచ్ లక్ష్మీపురం, జానకయ్యపేట, పెద తీనార్ల గ్రామాల్లో పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. గ్రామంలో ఎక్కడ చెత్తాచెదారం, ప్లాస్టిక్, చెత్త కుప్పలు కనిపించకూడదన్నారు. తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. సిహెచ్ లక్ష్మీపురంలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్టు తయారీ విధానం పరిశీలించి,పలు సూచనలు చేశారు.

రోడ్డు పనులు చేపట్టాలని నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : గొలుగొండ మండలంలోని డొంకాడ, కోందు గ్రామాలకు రహదారి పనులు చేపట్టాలని కోరుతూ బుధవారం ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, వినతిపత్రం అందజేశారు. అలాగే సబ్ కలెక్టర్‌గా ఐఎఎస్ అధికారిని నియమించాలని, ఆర్ఒఎఫ్ఆర్ కేసుల సత్వర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డొంకాడ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి 2023లోనే రూ.1.60కోట్ల నాబార్డు నిధులను మంజూరు చేసినా, అటవీశాఖ అభ్యంతరాలతో ఇప్పటివరకు పనులు చేపట్టలేదన్నారు. తక్షణమే ఆ రోడ్డుపనులకు ఫారెస్ట్ క్లియరెన్స్ చేపట్టి, పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. రోలుగుంట మండలం పనసలపాడు రెవిన్యూ పరిధిలో సర్వేనెంబర్ 8/1లో మాజీ సర్పంచ్‌కు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని నర్సీపట్నం సబ్ కలెక్టరేట్ కోర్టులో అప్పీలు చేసి ఆరేళ్లవుతున్నా నేటికీ ఎటువంటి చర్యలు లేకపోవడం దుర్మార్గమన్నారు

చోడవరం నియోజకవర్గ పరిధిలో రోలుగుంట మండలం ఆర్ల గ్రామం నుండి పిత్రిగడ్డ వరకు రూ.4.10కోట్లతో రోడ్డు పనులకు గ్రావెల్ వేసి అర్ధాంతరంగా వదిలేశారని, వైబి పట్నం నుండి పెద్దగరువు మీదుగా లోసింగి వరకు రూ.2.60కోట్లతో

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

రోడ్డు పనులకు అదే దుస్థితి ఉందన్నారు.. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ జోగంపేట నుండి నేరేడు బంధ గ్రామం వరకు రూ.2.50కోట్లతో రోడ్డు పనులు సైతం సగంలోనే నిలిచిపోయాయన్నారు. తక్షణమే ఆయా గ్రామాలకు రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. 23 మంది విద్యార్థులున్న లోసింగి పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని, జడ్ జోగంపేట కేంద్రంగా జిసిసి పాయింట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆందోళనలో ఆదివాసి గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, డొంకాడ గ్రామస్తులు కొండతాంబిల్లి అప్పారావు, గిరిజన సంఘం నాయకులు చీపు రమేష్ పాల్గొన్నారు

ఘనంగా సోనూసూద్ పుట్టినరోజు వేడుకలు

విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని జోగంపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో సాయానికి 10రూపాయలు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నటుడు, రియల్ హీరో సోనుసూద్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ ఆర్గనైజర్ ఏసుబాబు ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం వి.నాగభూషణం, ఉపాధ్యాయుల సమక్షంలో కేక్ కట్ చేసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం నాగభూషణం మాట్లాడుతూ .కరోనా సమయంలో సోనూసూద్ సేవాకార్యక్రమాలతో స్ఫూర్తి పొంది సాయానికి 10రూపాయలు సంస్థ స్థాపించి, అనేకమందికి సాయం చేస్తున్న సంస్థ ప్రతినిధులకు అభినందించారు. సంస్థ ఆర్గనైజర్ ఏసుబాబు మాట్లాడుతూ సోనుసూద్ స్ఫూర్తితో అనేకమంది అభాగ్యులను అనాధాశ్రమాల్లో చేర్పించామని, తలసేమియా బాధితులను ఆదుకున్నామని,వికలాంగ విద్యార్థులకు పెందుర్తిలో పాఠశాల ఏర్పాటు చేసి, ఉచితంగా చదువు చెప్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు స్పోర్ట్స్ టీ షర్ట్స్, ట్రాక్‌లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ గుడివాడ మురళి, సాయానికి పది రూపాయలు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యయుతంగా పాఠశాల ఎన్నికలు

ప్రజాశక్తి- పాయకరావుపేట : పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో బుధవారం ఇన్వెస్టిచర్ సెరిమనీ నిర్వహించారు. స్టూడెంట్ క్యాబినెట్ లీడర్లకు బ్యాడ్జిలను ఎస్ఐ సన్యాసిరావు, స్లాష్‌లను ఎఎస్ఐ జెర్రిపోతుల గోవిందరావు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ సన్యాసిరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యయుతంగా పాఠశాలలో విద్యార్థుల ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ పంచదార్ల మాణిక్యాలరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, నాయకత్వ నైపుణ్యాలను, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించడం లక్ష్యమన్నారు.. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రమణ, డీన్ మనీష్ , సి బ్యాచ్ ఇంఛార్జి లక్ష్మీకాంతం, ప్రైమరీ ఇంఛార్జిలు కల్పన, ఝాన్సీ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి

విద్యార్థులకు బ్యాడ్జీలను అందిస్తున్న ఎస్ఐ, ఎఎస్ఐ

గౌరి, వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, సువర్ణరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - కోటవురట్ల : పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించరాదని ఎంపిడిఒ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలో ఎండపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పట్ల నిర్లక్ష్యం వహించరాద, చెత్తను ఎప్పటికప్పుడు సంపద కేంద్రాలకు తరలించాలని సిబ్బందికి సూచించారు. తాగునీరు వ్యవస్థ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు . కార్యక్రమంలో కార్యదర్శి రవికిరణ్ పాల్గొన్నారు.

రెవెన్యూ ఫిర్యాదుల సత్వర పరిష్కారం

ప్రజాశక్తి -కోటవురట్ల: రెవిన్యూ సమస్యలపై అందిన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదని తహశీల్దార్ తిరుమల బాబు సూచించారు. బుధవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశంలో మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అర్హులకు కౌలు రైతు కార్డులు ఇవ్వాలని, నీటి తీరువా వసూలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు, కార్యక్రమంలో డిటి రమేష్, ఆర్ఐ మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయం గోదాదేవి సన్నిధిలో బుధవారం టిటిడి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి వేంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.

వాలీబాల్ పోటీల్లో ప్రకాష్ విద్యార్థులకు రజతం

రజత పతకం సాధించిన శ్రీప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి - పాయకరావుపేట : సిబిఎస్ఇ క్లస్టర్ -7, అండర్ -14 బాలుర విభాగం వాలీబాల్ పోటీల్లో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యార్థులు సత్తాచాటారు. రన్నరప్‌గా నిలిచి, రజత పతకాన్ని సాధించారు. ఈ నెల 26 నుండి 29 వరకు హైదరాబాద్ నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్‌లో నిర్వహించిన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన కోచ్‌లు విజయ్, దుర్గా ప్రసాద్‌లను శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వి కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ అపర్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - ఎస్ రాయవరం : మండలంలో గెడ్డపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సౌజన్య నాట్లు వేస్తున్న పొలాలను సందర్శించి రైతులకు సూచనలు చేశారు. నాలుగు నుండి ఆరు ఆకులున్న నారును నాటితే పిలకలు ఎక్కువగతొడిగే అవకాశముందన్నారు. నాటిన తర్వాత ప్రతి రెండుమీటర్లకు 20సెంటీమీటర్ల బాటలు తీయటం వలన పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడిపిడాల ఉధృతి అదుపుచేయవచ్చున్నారు. ముదురు నారు నాటినాపుడు నత్రజని ఎరువును మూడు దఫాలుగా గాక, రెండు దఫాలుగా 70 శాతం దమ్ములోను మిగితా30 శాతం అంకురం దశలోనూ వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తన్నీరు ఏరకయ్య, ఉద్యానవన అసిస్టెంట్ మంజు వాణి, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లి : వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. బుధవారం ఉపమాకలో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలు,ఎరువులు, యాంత్రికరణ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ శాస్త్రవేత్త, బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వరి నారుమళ్లలో తెగుళ్ల, తీసుకోవాల్సిన చర్యలపై వివరించారకార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, జగదీశ్వరరావు, దొరబాబు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్,రైతు సేవా కేంద్రం సిబ్బంది నాగేశ్వరరావు, రవి, కొండలరావు, ప్రశాంతి పాల్గొన్నారు.

తాండవ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో అత్యధికంగా మెట్ట ప్రాంతాలకు సాగు అందించే తాండవ రిజర్వాయర్ అభివృద్ధి పనులను తాండవ ఛానల్ ఉపాధ్యక్షులు వేచలపు భాస్కరరావు శంకుస్థాపన చేశారు. కొత్తూరు నుంచి నీలిగుంట వరకు కాలువ అభివృద్ధి పనులతో పాటు పూడికతీత పనులను రూ.16 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఆయా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు ఖరీఫ్‌లో రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ సత్యనారాయణ, లోకవరపు గంగునాయుడు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ఛార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. బుధవారం నర్సీపట్నం శ్రీకృష్ణాపేలస్‌లో నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే పనులు చేపడితే ఉపేక్షించేది లేదన్నారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, జిల్లా సెక్రటరీలు పంచాడ హరినాథ్, అల్లాడ సురేష్, గండెం దొరబాబు, రేగుబల్ల శివ, వెలగల వెంకటరమణ, యర్రంశెట్టి పాపారావు, పోలుపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చలో విద్యుత్ సౌధ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పీస్ రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 7న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. బుధవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో చలో విద్యుత్ సౌధ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26 వేల మంది విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, సబ్ స్టేషన్ ఆపరేటర్స్, పీక్ లోడ్, సెక్షన్ ఆపరేటర్లు, ఎటిపి ఆపరేటర్లు, మీటర్ రీడర్లు, స్టోర్స్ లోడింగ్, అన్ లోడింగ్ హమాలీలు.. ఇలా వివిధ రకాల పేర్లతో పని చేస్తున్నారన్నారు. వారందరినీ రెగ్యులర్ చేస్తామని, అనేక సంవత్సరాలుగా ప్రభుత్వాలు హామీ ఇస్తున్నా అమలు చేయటం లేదన్నారు. షిఫ్ట్ ఆపరేటర్లకు రూ.46 వేల జీతం చెల్లించాలని, పెండింగ్ ఎరియర్స్‌ను జమ చేయాలని, తెలంగాణ మాదిరిగా సంస్థలో విలీనం చేయాలని, మీటర్ రీడర్లకు, స్టోర్స్‌లో పనిచేస్తున్న హమాలీలకు పీస్ రేట్ విధానాన్ని రద్దుచేసి నెలవారీ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, ఎస్.అవతారం, నూకరాజు పాల్గొన్నారు.

రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు

.మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి :మండలంలో వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఇల్లులు కోల్పోతున్న నిర్వాసితులకు రూ.25 లక్షలు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. బుధవారం నక్కపల్లి సిపిఎం కార్యాలయంలో మాట్లాడుతూ ఇల్లులు కోల్పోయిన నిర్వాసితులకు గురువారం ఇంటి పట్టాలు ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని, అయితే అధికారులు ఇస్తామంటున్న రూ.8.98లక్షల సాయం ఇంటి నిర్మాణాలకు సరిపోదన్నారు. ముడిసరుకు ధరలు, గృహనిర్మాణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో చాలీచాలని ప్యాకేజీతో ఇళ్లను ఎలా నిర్మించుకుంటారో ప్రభుత్వం అధికారులే చెప్పాలన్నారు. . దీంతోపాటు రూ.25 లక్షలు ప్యాకేజీ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షలు ఆర్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, మనవడు, మనవరాళ్లు అనే తేడా లేకుండా, అలాగే వివాహమైన ఆడపిల్లలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలన్నారు. ఆర్.కార్డు ఇచ్చి ఏర్పాటు చేయబోయే పరిశ్రమల్లో శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిరాయితీ, డీ ఫారం పట్టాభూముల్లో చెట్లు, బోర్లు, బావులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాలని, అదనపు భూ సేకరణ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనేక రూపాల్లో ఆందోళన చేపట్టి, అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ, స్పందన లేకపోవడం సరికాదన్నారు కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్ పాల్గొన్నారు.

అధ్యక్షా.. ఘోరం చూశారా..!

- అల్లూరి స్మృతులను మాయం చేస్తున్నారు..
- అయ్యన్న ఇలాకాలో అక్రమ నిర్మాణాలు
- కోర్టులో కేసు ఉండగానే యథేచ్ఛగా భూదోపిడీ
- చోద్యం చూస్తున్న అధికారులు, నేతలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : మన్యానికి ముఖద్వారంలా ఉన్న నర్సీపట్నం నడిబొడ్డున అల్లూరి పోరాటానికి గుర్తులుగా ఉన్న బ్రిటిష్ అధికారుల సమాధి స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. రాష్ట్ర శాసనసభాపతి అయ్యన్న ఇలాకాలోనే యథేచ్ఛగా చారిత్రక స్మృతులకు నిదర్శనంగా ఉన్న రూ.కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేస్తుంటే అధికారులు, నేతలు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

నర్సీపట్నంలో అల్లూరి స్వాతంత్ర్య పోరాటానికి చిహ్నంగా లియోనెల్ నెవెల్లీ హైటర్, క్రిస్టోఫర్ విలియం స్కాట్ కవర్డు బ్రిటీష్ అధికారుల సమాధులున్నాయి. తొలుత సమాధులున్న స్థలం 46సెంట్లు ఉండగా, కాలక్రమేణా ఆక్రమణలకు గురౌతూ 19 సెంట్లకు కుచించుకు పోయింది. మిగిలిన ఈ స్థలాన్నైనా పరిరక్షించాలని ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు విపక్షంలో ఉన్నప్పుడు అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఇతర సభ్యులు వెళ్లి అర్థించారు. అప్పట్లో స్పందించిన అయ్యన్న, సమాధుల స్థలాన్ని పరిరక్షించడంతోపాటు, నందనవనంలా తీర్చిదిద్దుతామని అప్పట్లో మాటిచ్చారు. అయితే కోట్ల విలువచేసే ఈ స్థలాన్ని కాపాడి, భావితరాలకు గుర్తుగా మిగల్చాలని కొందరు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. దీనిపై స్పందించిన సీనియర్ సివిల్ జడ్జి పి.పియాష్‌ఖాన్ అధికారులతో కలిసి బ్రిటిష్ సైనికాధికారుల సమాధుల స్థలాన్ని ఈ నెల 10న క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. చాలా వరకు స్థలం ఆక్రమణకు గురైందని, పురావస్తుశాఖకు చెందినదిగా

గ్రీన్ పరదాల మాటున సమాధుల స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న షాపింగ్ మాల్

షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతుల్లేవు

సమాధుల స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నట్లు దృష్టికి వచ్చింది. దీనిపై పరిశీలన జరిపి నోటీసులిస్తాం. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మున్సిపాలిటీ అనుమతులు లేవు. దీనిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం.

– జంపా సురేంద్ర, మున్సిపల్ కమిషనర్

2011లోనే నోటిఫై చేసినా, స్థలాల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. నిధుల లేమితో పరిరక్షణ చర్యలు తీసుకోలేకపోయామని పురావస్తుశాఖ సహాయ సంచాలకులు ఫల్గుణరావు న్యాయమూర్తి వద్ద నిస్సహాయ వ్యక్తం చేశారు. దీంతో . స్థలం అన్యాక్రాంతం కాకుండా తాత్కాలిక రక్షణ చర్యలైనా చేపట్టాలని న్యాయమూర్తి పియాష్‌ఖాన్ మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్రకు సూచించారు.

ఒక పక్క న్యాయపరంగా సమాధుల స్థలాన్ని పరిరక్షించే చర్యలు చేపడుతుండగా, మరోపక్క కోర్టులో కేసు ఉండగానే, స్పీకర్ అయ్యన్న ఇలాకాలోనేసమాధుల స్థలాన్ని ఆక్రమించి, గ్రీన్ పరదాల మాటుల యథేచ్ఛగా భారీ షాపింగ్‌మాల్ నిర్మాణం చేస్తున్నారు. సమాధుల వద్దకు వెళ్లే దారి కూడా లేకుండా పూర్తిగా కప్పేసి నిర్మాణాలు చేపడుతుండడంతో పలువురు ఆవేదన చెందుతున్నారు. సొంతూరులో జరుగుతున్న ఈ ఆక్రమంపై అటు అయ్యన్నగానీ, ఇటు మున్సిపల్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు కూటమి నేతలు స్పందించి, రూ.కోట్ల విలువ చేసే సమాధుల స్థలాన్ని పరిరక్షించాలని వేడుకుంటున్నారు. వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చారిత్రక స్మృతుల పరిరక్షణకు ఫిర్యాదులు, వినతులు చేసినా స్పందన లేకపోవడంతో పోరాటానికి సన్నద్ధమౌతున్నాయి.

ప్రజా సంఘాల ఆందోళన

అల్లూరి పోరాటానికి చారిత్రక సాక్ష్యంగా ఉన్న సమాధుల స్థలంలో అక్రమ నిర్మాణాలను ఆపాలని సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, బ్రిటీష్ అధికారుల సమాధుల స్థలాన్ని ఆక్రమించి, వారంరోజులుగా అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, దీనిపై ఈనెల 31న జరిగే మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించాలన్నారు. బుధవారం నర్సీపట్నం పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కూడా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలపై మున్సిపల్, రెవెన్యూ అధికారులు

ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

స్పందించకుంటే ప్రజాసంఘాల తరపున పోరాటాన్ని ఉధృతం చేసి అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఆందోళనలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కెవి.సూర్యప్రభ, ఎపి రైతు సంఘం జిల్లాఅధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అయ్యన్న స్పందించాలి

అల్లూరి పోరాట స్ఫూర్తికి ప్రతిరూపంగా ఉన్న సమాధుల స్థలాన్ని అక్రమార్కుల చెర నుండి స్పీకర్ అయ్యన్నపాత్రుడు కాపాడాలి. బాధ్యులపై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలి లేకుంటే సిపిఎం తరపున ఉద్యమించి, కాపాడుకుంటాం.

– జి.కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఏరియా ఆసుపత్రికి గుర్తింపు తేవాలి

- అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు

అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న, కలెక్టర్

ప్రజాశక్తి -నర్సీపట్నం : నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి ప్రత్యేక గుర్తింపు తేవాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. బుధవారం ఎన్‌టిపిఐసి సిఎస్‌ఆర్ నిధులు రూ.35లక్షలతో సమకూర్చిన అంబులెన్స్‌ను కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ప్రారంభించారు, అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతూ నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి ఈ ప్రాంతీయులే కాకుండా,కొయ్యూరు, పాడేరు తుని తదితర ప్రాంతాల నుంచి రోగులు అత్యధికంగా వైద్యానికి వస్తుంటారని, వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

గతంలో ఏరియా ఆసుపత్రికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉందని, దాన్ని నిలబెట్టుకునేలా సేవలను విస్తృతం చేయాలన్నారు. ఆసుపత్రిలో సెంట్రలైజ్ ఆక్సిజన్ అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు, ఆసుపత్రి వద్ద పారిశుధ్యం, సెక్యూరిటీ మరింత పకడ్బందీగా ఉంచాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రమణమ్మ, మున్సిపల్ కౌన్సిలర్ పద్మావతి, ఆర్‌డిఒ బివి.రమణ, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, వైద్యాలయ సూపరింటెండెంట్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా తీవ్ర నేరం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు ఈసందర్భంగా అవగాహన సదస్సులో మానవ అక్రమ రవాణా అంటే ఏమిటి, ఎందుకు చేస్తున్నారు, ఎలా అరికట్టాలనే అంశాలపై చర్చించారు. మానవ అవయవాలకు మెడికల్ మాఫియా, చిన్న పిల్లలను అక్రమంగా అమ్ముకోవడం, యాచన చేస్తున్న పిల్లలను గుర్తించటం, స్త్రీలపై లైంగిక వేధింపులు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మండల లీగల్ సేవా సంస్థ వాలంటీర్లు కె. శివ నారాయణ రాజు, శివప్రసాద్ అధ్యాపకులు పాల్గొన్నారు.

దళిత రైతుల గోడు పట్టదా?

కలెక్టర్ కోసం ఎదురు చూస్తున్న కోడూరు దళిత రైతులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : మాకవరపాలెం మండలం జి.కోడూరులో దళిత రైతులు నిర్వహిస్తున్న నిరాహార దీక్ష బుధవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ నర్సీపట్నంలో పర్యటించినప్పటికీ, రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టర్ పర్యటన సందర్భంగా రైతులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేసినప్పటికీ వారి గోడును కలెక్టర్ గుర్తించలేదని ఆరోపించారు. . దళితులను చులకనగా చూసే వైఖరి కూటమి ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఏం జరుగుతుందో కలెక్టర్‌కు తెలియదా, లేకుంటే మైనింగ్ మాఫియాకు దన్నుగా ఉంటూ పట్టించుకోవడం లేదాయని ప్రశ్నించారు.. తమ సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.